క్లుప్తంగా

బధిరుల పాఠశాలలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని కాసనబాద శివారులో ఉన్న బధిరుల పాఠశాలలో శుక్రవారం రాత్రి సూర్యాపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది బత్తిని వెంకటేశ్వర్లు తన కుమార్తె జోషిణి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మందికి అన్నదానం చేశారు. అదే విధంగా పాలు, పండ్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మదనాచారి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కటకం వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడు బత్తుల జలేందర్, వీరబోయిన రాములు శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి నిర్మాణం ధ్వంసం చేసిన వ్యక్తుల రిమాండ్

మద్దిరాల : ఇంటి నిర్మాణ పనులను ధ్వంసం చేసిన వ్యక్తులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. భూవివాదంలో ఇంటి నిర్మాణం ధ్వంసంపై మద్దిరాలకు చెందిన నవ్వుల మల్లారెడ్డి అదే గ్రామానికి చెందిన వల్లపు అవిలయ్యపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అవిలయ్యతోపాటు మరో 9 మందిని పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

జీవాలకు పీపీఆర్ టీకాలు


టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని కుంచమర్తి, ఉయ్యాలవాడ గ్రామాల్లో శుక్రవారం గొర్రెలు, మేకలకు పీపీఆర్ టీకాలు వేశారు. పెంపకందారులు తప్పనిసరిగా తమ జీవాలకు ఈ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, సిబ్బంది యాకయ్య, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : రైతాంగ విప్లవం కోసం జీవితాన్ని అంకితం చేసిన చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ వర్గం జిల్లా కార్యదర్శి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 9న హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో, 25న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎంవీ ప్రసాద్ భవనంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తున్నట్లు తెలి పారు. పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైన్‌షాపు సీజ్

నడిగూడెం : మండల కేంద్రంలోని సునీత వైన్ షాపును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ కోదాడ సీఐ శ్రీనివాస్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో వైన్‌షాపును ఆకస్మికంగా తనిఖీ చేయగా నడిగూడెంలోని ప్రగతి వైన్ దుకాణానికి చెందిన 90 మద్యం బాటిళ్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఉండటంతో వైన్ షాపును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మోతె: రాంపురంతండా, మామిళ్లగూడెం గ్రామాల్లో పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మామిళ్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నలమాద పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పుల్లారావు, మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, సర్పంచ్ యల్లయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ గుర్వారెడ్డి, కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పద్మావతి

యువత ఓట్లే కీలకం

తుంగతుర్తి నియోజకవర్గంలో సగానికి పైగా యూత్ ఓటర్లే..



తిరుమలగిరి : ఎన్నికల్లో అతి కొద్ది శాతం ఓట్ల తేడాతోనే ఫలితాలు తారుమారవుతున్న సంఘటనలు చూస్తున్నాం. ఒక్కోసారి ఒక్క ఓటే కీలకంగా మారుతుంది. అందుకే పంచాయతీ ఎన్నికల నుంచి పార్లమెంట్ ఎన్నికల వరకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా రాజకీయ పార్టీలు ప్రయత్నాలు మొదలుపెడతాయి. ఈసారి తుంగతుర్తి నియోజకవర్గంలో నమోదైన ఓటర్లను పరిశీలిస్తే యువ ఓటర్లే కీలకంగా మారనున్నారు.

1,24,669 మంది యువ ఓటర్లు..

తుంగతుర్తి నియోజకవర్గంలో 2,48,556 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,24,826 మంది, మహిళలు 1,23,722 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. ఇందులో 18 సంవత్సరాల నుంచి 39 ఏళ్లలోపు ఉన్న ఓటర్లు 1,24,669 మంది. అంటే యువ ఓటర్లే సగానికి పైగా ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో వీరి ఓట్లే కీలకం కానున్నాయి. యువత ఓట్లు ఆయా పార్టీల గెలుపును నిర్దేశిస్తాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో యువత ఓట్లను దక్కించుకునేందుకు అన్ని పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి.

ఓటర్ల వివరాలు..

వయస్సు	ఓటర్ల సంఖ్య
18-19	7,388
20-29	48,222
30-39	69,059

యువ ఓటర్లపైనే నేతల భవిత..

ప్రస్తుతం తరుణంలో రాజకీయ నాయకుల భవిష్యత్తును నిర్ణయించడంలో యువతదే కీలక పాత్ర. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువత సోషల్ మీడియాలో వివిధ పార్టీల గురించి ఎక్కువ పోస్టులు పెడుతుంటారు. తమ తల్లిదండ్రులకు రాజకీయ అవగాహన కల్పిస్తుంటారు. నాయకులు చెప్పిన మాటల కంటే పెద్దలు తమ పిల్లల మాటలు ఎక్కువగా వినే అవకాశం ఉంది. సామాన్యులు వారి పరిస్థితుల దృష్ట్యా రాజకీయ నాయకులు ఇచ్చిన కానుకలకు కట్టుబడి ఓటు వేసే అవకాశం ఉంటుంది. కానీ యువత అలా కాదు. రాజకీయ నాయకులు చేసే లోపాలు, అవినీతి, అక్రమాలను గుర్తిస్తుంటారు. ఎవరు మంచి చేస్తారో వారికే మద్దతు ఇచ్చే అవకాశం ఉంటుంది. చదువుతున్న యువతతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు ఇంటికొకరు ఉంటారు. దీంతో ప్రతి కుటుంబంలో యువత వర్తమాన రాజకీయాలు చర్చిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తుంటారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో యువత పాత్ర కీలకం కానుంది.

ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ఎవరెన్ని చెప్పినా ఒక్క క్షణం ఆగి మంచి, చెడులను నిర్ణయించుకోవాలి. ఒక్క ఓటు మాత్రమే నేతల తల రాతలు మార్చగలదు.

– సుజిత్‌రెడ్డి, తిరుమలగిరి

నిస్వార్థంగా సేవ చేసే వారికే..

ప్రజల కోసం నిస్వార్థంగా సేవ చేసే వారికే ఓటు వేస్తాం. ఒక వస్తువు కొనుగోలు చేయాలంటేనే ఒక్కటికి పదిసార్లు ఆలోచిస్తాం. అలాంటిది ఐదేళ్ల పాటు ఒక వ్యక్తికి అధికారం అప్పగించాలంటే ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా మంచి, చెడులు ఆలోచించాలి.

– లక్ష్మి, తిరుమలగిరి

మొదలైన నామినేషన్ల పర్వం


సూర్యాపేటలో నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న లింగిడి వెంకటేశ్వర్లు


సూర్యాపేట ఆర్వో కార్యాలయం వద్ద బందోబస్తు

భానుపురి : తెలంగాణ శాసనసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో శుక్రవారం అధికారులు సూర్యాపేట ఆర్వో పరిధిలో నామినేషన్ల స్వీకరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ఆర్వో కె.వీరబ్రహ్మాచారికి ప్రజావాణి పార్టీ తరఫున సూర్యాపేట పట్టణానికి చెందిన లింగిడి వెంకటేశ్వర్లు తొలి నామినేషన్‌ను దాఖలు చేశారు. గత ఎన్నికల సమయంలో లింగిడి వెంకటేశ్వర్లు ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున ఎమ్మెల్యే బరిలో నిలిచారు. ప్రస్తుతం సొంతంగానే పార్టీని స్థాపించి జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉన్నారు.

తుంగతుర్తిలో ఒకరు నామినేషన్..

తుంగతుర్తి : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తుంగతుర్తి అసెంబ్లీ స్థానానికి శుక్రవారం మొదటి రోజు 1 నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. మొదటిరోజు ఎంసీపీఐ(యూ) అభ్యర్థి ఈదుల వీరపాపయ్య రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ యాదగిరిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టో పేదలకు భరోసా


సూర్యాపేట : ప్రచారం చేస్తున్న సునీత

సూర్యాపేట : బీఆర్‌ఎస్ మేనిఫెస్టో పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా అని మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సతీమణి సునీత అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని 11, 30, 10వ వార్డుల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి జగదీష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

కిషోర్‌ను గెలిపించాలని ప్రచారం

నాగారం : తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను ప్రజలు మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల నాయకుడు కూరం వెంకన్న కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌ని ప్రజలు ఆదరించి గాదరి కిషోర్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


సూర్యనాయక్‌తండాలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ సత్యం

అర్వపల్లి : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మే రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించాలని తిమ్మాపురం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం సూచించారు. శుక్రవారం సూర్యనాయక్‌తండా, కుంచమర్తి, కొమ్మాల, కోడూరు తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యంలో మట్టి పెళ్లలు, రాళ్లు, చెత్త, తాలు లేకుండా 17శాతంలోపు తేమ ఉంటే మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుజాత, సైదులు, నర్సింహ, లింగస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్య పరీక్ష


అర్వపల్లిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అర్వపల్లి : మండలంలో ఎంపిక చేసిన 15 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం అభ్యసన సామర్థ్య పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించడానికి ఈ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 19 మంది క్షేత్ర పరిశోధకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటు


కొమ్మాలలోని పోలింగ్ కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న కార్యదర్శి నారాయణస్వామి

అర్వపల్లి : కొమ్మాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి చెప్పారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాటును ఆయన పరిశీలించారు. శుక్రవారం మరుగుదొడ్లు, విద్యుత్, నీటి వసతి, ఫర్నిచర్ ఏర్పాటు పనులను చేపట్టారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు యశోద, విజయలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల పక్షాన నిలబడేది బీజేపీ


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : రైతుల పక్షాన నిలబడేది బీజేపీ ప్రభుత్వమేనని సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, నాగులపహాడ్, నారాయణగూడెం, దోసపహాడ్, అనాజిపురం, అనంతారం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండానే మరోసారి ప్రజలను మోసం చేసేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందకుండా చేస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరికీ మేలు చేసే పార్టీ బీజేపీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోకల రాములు, మండల ఇన్‌చార్జ్ గజ్జెల వెంకట్‌రెడ్డి, కట్కూరి కపిల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, చెన్ను రమణారెడ్డి, కిషన్, మన్మథరెడ్డి, ధనుంజయ్‌గౌడ్, సంధ్య, మధు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు చేరుతున్న ధాన్యం

- కొనుగోళ్ల ప్రక్రియను ముమ్మరం చేస్తున్న అధికారులు
- జాజిరెడ్డిగూడెం మండలంలో 20 కేంద్రాల ఏర్పాటు


జాజిరెడ్డిగూడెంలోని సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం


అర్వపల్లిలో ధాన్యం బస్తాలను లారీకి లోడు చేస్తున్న హమాలీలు

అర్వపల్లి : వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మొదలైంది. కొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు ముమ్మరం కాగా మరికొన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలు కావాల్సి ఉంది. కొనుగోళ్లు కాని కేంద్రాల్లో ధాన్యం కాంటాలు ప్రారంభించడం కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇప్పటికే పది రోజుల వ్యవధిలో రెండు సార్లు వర్షాలు పడి కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసింది. దీంతో రైతులు నష్టపోయారు. అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లను ముమ్మరం చేయాలని రైతులు కోరుతున్నారు.

20 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు..

జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్‌లో 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సెర్ప్ ఆధ్వర్యంలో 10, ఎన్డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 3, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 3, తిమ్మాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 2, రైతు సంఘాల ఆధ్వర్యంలో రెండు చొప్పున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 15 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాగా మిగిలిన వాటిలో కాంటాలు మొదలు కావాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు 10 వేల క్వింటాల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు ఎగుమతి చేస్తున్నారు. అయితే కేంద్రాల్లో పోసిన ధాన్యానికి 17 శాతానికి మించి తేమ ఉండటంతో ధాన్యాన్ని ఎండబెట్టాలని అధికారులు సూచించారు.

ధాన్యాన్ని శుభ్రం చేసి ఆరబెట్టాలి



రైతులు ముఖ్యంగా వరి పంట కోయగానే పచ్చి ధాన్యాన్ని కేంద్రాలకు తెస్తుండటంతో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసుకొని తెస్తే ప్రభుత్వ మద్దతు ధర దక్కుతుంది.

- వలిశెట్టి మల్లేష్, ఏపీఎం

కొనుగోళ్లను ముమ్మరం చేస్తున్నాం



ధాన్యం కొనుగోళ్లను మండలంలో ముమ్మరం చేస్తున్నాం. మండలంలో 20 కేంద్రాల ద్వారా కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతుంది. ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2203, బీ–గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2183 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుంది. వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- జక్కర్తి శ్రీనివాసులు తహసీల్దార్, నోడల్ అధికారి

బహుజనులంతా ఏకం కావాలి


మాట్లాడుతున్న వట్టె జానయ్యయాదవ్

భానుపురి : బహుజనులంతా ఏకమై మనకు మనమే ఓటు వేసుకుని రాజ్యాధికారాన్ని సాధించుకోవాలని సూర్యాపేట నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎస్సీ ఉపకులాల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఎస్పీకి ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని కోరారు. సూర్యాపేటలో వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తిని రెండుసార్లు గెలిపిస్తే స్వార్థంతో అవినీతికి పాల్పడుతున్నాడని అన్నారు. ఎన్నికల్లో బీఎస్పీకి మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం నాయకులు ప్రకటించారు. నకరేకంటి వెంకన్న సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు భిక్షమయ్య గౌడ్, 6వ వార్డు కౌన్సిలర్ ధరావత్ నీలాబాయి, లింగానాయక్, ఇస్తాలపురం ఎంపీటీసీ చెరుకు ఇందిర, పాతర్లపహాడ్ సర్పంచ్ కేశబోయిన మల్లయ్య యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తుంగతుర్తి : హైదరాబాద్‌లోని జలవిహార్‌లో శనివారం జరిగే తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లీగల్ సెల్ న్యాయవాది జిల్లా కుమారస్వామి కోరారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఆత్మీయ సమ్మేళన సభకు మంత్రి కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ముఖ్య అతిథిలుగా హాజరవుతారని తెలిపారు. ఈ సభకు న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తాళ్లపల్లి సత్యనారాయణ, చంద్రమౌళి, వంగాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీలేక.. భయం భయం!

- పెన్‌పహాడ్‌లోని కేజీబీవీకి ప్రహరీ నిర్మాణంలో అధికారుల నిర్లక్ష్యం
- భయాందోళనలో విద్యార్థినులు


పెన్‌పహాడ్‌లోని కస్తూరిబా పాఠశాల

పెన్‌పహాడ్ : పేద కుటుంబాలకు చెందిన బాలికలతో పాటు అర్ధంతరంగా చదువు మానేసిన బాలికలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా విద్యార్థినులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. కస్తూరిబా పాఠశాలల్లో ఉచిత విద్య, వసతి, భోజనం, దుస్తులు అందజేస్తూ.. చదువులో రాణించేందుకు ప్రభుత్వం విద్యార్థినులను ప్రోత్సహిస్తోంది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా కొన్ని పాఠశాలలకు సరైన వసతులు లేవు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని కేజీబీవీకి అదే పరిస్థితి నెలకొంది. మండలంలోని కేజీబీవీలో సుమారు 160మందికి పైగా విద్యార్థినులు చదువుకుంటున్నారు. కానీ పాఠశాలకు ప్రహరీ లేక వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో పశువులు సూళ్ల ఆవరణలోకి వస్తున్నాయని విద్యార్థినులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని అధికారులను కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం

కేజీబీవీ వసతి గృహానికి ప్ర హరీ నిర్మించాలని అధికారులను కోరాము. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మిస్తే విద్యార్థుల కష్టాలు తీరుతాయి.

- ఆసీయాజబీన్, కేజీబీవీ ప్రత్యేక అధికారి

సీపీఎం నాయకుడు మృతి

నడిగూడెం : మండలంలోని బృందావనపురానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ముసుకు వెంకయ్య (85) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, నాయకులు కొండూరు వేలాద్రి, నరేష్, శ్రీను, వెంకటేశ్వర్లు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మాలధారులకు అన్నదానం

అనంతగిరి : మండల కేంద్రంలోని కొండపై కొలువై ఉన్న హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయ చైర్మన్ కొండపల్లి వాసు అన్నదానం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు 48 రోజులపాటు నిత్యాన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు పాలిక నర్సింహారావు, గాధం శ్రీను పాల్గొన్నారు.

విద్యావేత్తకు డాక్టరేట్

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన విద్యావేత్త హసనబాద రాజేష్‌కు డాక్టరేట్ లభించింది. వినియోగ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి వినియోగ వస్తు బ్రాండ్ వ్యూహాలపై ఆయన పరిశోధన చేశారు. దీంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన 83వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్, అబోడ్ కంపెనీ సీఈఓ శంతన్ నారాయణన్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన గీత కార్మికుడు గుండు రాంబాబు ఇటీవల తాటి చెట్టుపై నుంచి కింద పడడంతో గాయాలయ్యాయి. శుక్రవారం ఆయనను తెలంగాణ గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజిబాబు పరామర్శించారు. రాంబాబుకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

11న మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుంగతుర్తి : హైదరాబాద్‌లో ఈ నెల 11న జరిగే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ తూరుగంటి అంజయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విశ్వరూప మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మాదిగలంతా ఏకం కావాలన్నారు. హైదరాబాద్‌లో జరిగే సభకు ప్రతి గ్రామం నుంచి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రవి, వినయ్‌బాబు, పాల్వాయి బాలయ్య, పరశురాములు, శ్రీను, గంగాధర్, సాయిబాబా, నవీన్, భాను, ప్రకాష్, రాంబాబు, లక్ష్మణ్, సాయికుమార్, శ్రీకాంత్, రవి, మనోజ్, భాను పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ


చరణ్‌ను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

కోదాడఅర్బన్ : తమిళనాడులో అక్టోబర్ 27 నుంచి 29 వరకు జరిగిన 7వ నేషనల్ ఫస్ట్‌బాల్ (హ్యాండ్ బాల్) పోటీల్లో కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థి కె.చరణ్ ప్రతిభ కనబరిచి మూడవ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాల్, కరస్పాండెంట్ వై.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొన్న టీమ్‌కు చరణ్ కెప్టెన్‌గా వ్యవహరించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతడిని అభినందించి ఘనంగా సన్మానించారు. చరణ్‌ను అభినందించిన వారిలో కళాశాల చైర్మన్ వడ్డే రాజేష్‌చౌదరి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు రాయుడు, తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- కోదాడ డీఎస్పీ ప్రకాష్


రఘునాథపాలెంలో సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మఠంపల్లి : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో సమస్యాత్మక గ్రామమైన రఘునాథపాలెంలో శుక్రవారం కోదాడ డీఎస్పీ ప్రకాష్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోదాడ డీఎస్పీ ప్రకాశ్ మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, మఠంపల్లి ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ, సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.